సాక్షి
చిత్తూరు
మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



భూసారం.. భవితవ్యం
రసాయన ఎరువుల వినియోగంతో భూములు సారం కోల్పోతున్నాయి. సేంద్రియ ఎరువులే వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. 8లో



మంత్రి ఇంట.. ఇఫ్తార్ విందు
నగరిలోని ముస్లింలకు మంత్రి రోజా సోమవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. తరలివచ్చిన ముస్లింలకు కృతజ్ఞతలు తెలిపారు. 10లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	40	22
తిరుపతి	40	22
తిరుమల	36	19
గూడూరు	42	24
నగరి	41	23



ఆరోగ్య భాగ్యం!



'ప్రతి పేదవాడికీ కార్పొరేట్ వైద్యం అందాలి. ఆస్పత్రులకు వెళ్లిన రోగులకు అక్కడే అన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలి. అవసరమైన మందులు అందించాలి. చాలినంతమంది సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో ఉండాలి' అన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను బలోపేతం చేసింది. నాడు-నేడుతో వాటి రూపురేఖలను సమూలంగా మార్చేసింది. కార్పొరేట్ తలదన్నేలా చూడముచ్చటగా తీర్చిదిద్దింది. అవసరం మేరకు సిబ్బందిని నియమించి రోగుల బాగోగులను చూస్తోంది. దీనిపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

– సాక్షి, తిరుపతి

నా పేరు పద్మజ. నా భర్త పేరు విజయ్. మాది ఏర్పేడు మండలం, పాపానాయుడుపేట. రెండు రోజుల క్రితం పురిటినొప్పులు వచ్చాయి. భయం వేసింది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఊర్లో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లాం. అక్కడ ఉప సిస్టర్స్ ఇబ్బంది లేకుండా కాన్పుచేశారు. పైసా ఖర్చులేకుండా క్షేమంగా ఇంటికి పంపించారు. పీహెచ్‌సీలో అన్ని వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవితాంతం రుణపడి ఉంటాను. సకాలంలో చికిత్స అందించి, ఆదుకున్న ఆస్పత్రి సిబ్బందికి కృతజ్ఞతలు.



నా పేరు కన్నమ్మ. చిత్తూరు మండలం, నల్లవెం కటయ్యగారిపల్లె. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి డబ్బులు ఇచ్చుకునే బాధ తప్పింది. ఎన్‌ఆర్‌పేట వద్ద ప్రభుత్వాస్పత్రికి వెళ్తే వాళ్లే చెక్‌చేసి మందులు ఇచ్చి పంపుతున్నారు. ఇప్పుడు కొత్తగా ఆస్పత్రికి వెళ్లలేని వారి ఇంటికే డాక్టర్లు వచ్చి చూసి వెళ్తున్నారు. నర్సులు, డాక్టర్లు రోజూ ఇంటికొచ్చి సలహాలు,సూచనలు ఇస్తున్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం ఆస్పత్రులను బాగు చేసింది. మాలాంటి పేదోళ్లకు అండగా నిలిచింది. ఆనందంగా ఉంది.

ప్రాథమిక' ఆరోగ్యం భేష్
- ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్ ఆస్పత్రులను తలపిస్తున్న పీహెచ్‌సీలు
- ఆస్పత్రుల నిండా సిబ్బంది, పరికరాలు, మందులు
- అందుబాటులో 55 టెస్టులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రోగులు



చిన్నపాండూరు వద్ద త్వరలో ప్రారంభించనున్న పీహెచ్‌సీ నూతన భవనం



కాన్పు అనంతరం పురిటి బిడ్డను తల్లి పద్మజకు చూపిస్తున్న ఏఎన్‌ఎం (ఫైల్)

టీడీపీ హయాంలో..

పగిలిన కిటికీలు.. ఊడిపోయిన తలుపులు.. మసిబారిన గోడలు.. శిథిలావస్థలో భవనాలు.. దెయ్యాల మేడలు తలపించేలా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు కనిపించేవి. సిబ్బంది కొరత రోగులను తీవ్రంగా పీడించేది. ఇద్దరుముగ్గురు సిబ్బందితోనే ఆస్పత్రిని నెట్టుకురావాల్సి దుస్థితి ఏర్పడేది. ఉన్న సిబ్బంది కూడా సమయానికి రాక అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొనేది. డాక్టర్లు చుట్టపుచూపుగా వచ్చి వెళ్లడం రివాజుగా మారేది. సొంత క్లినిక్‌లపై మోజు పెంచుకుని ప్రభుత్వాస్పత్రులను గాలికొదిలేసినా అడిగే నాథుడే ఉండేవారు కాదు. ఇక మందులు, వైద్య పరీక్షలు, కాన్పుగ్రటా అంటే ఉన్న అరకొర సిబ్బంది ప్రయివేటు ఆస్పత్రులకు రెఫర్ చేయడం క్షణాల్లో జరిగిపోయేది.

నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో..

కళాత్మకమైన రంగులు.. అధునాతన పరికరాలు.. ఆధునిక సౌకర్యాలు.. కావాల్సినన్ని మందులు.. అందుబాటులో వైద్య పరీక్షలు.. ఆస్పత్రుల నిండా సిబ్బంది, డాక్టర్లు.. అబ్బో.. చూస్తే కార్పొరేట్ తలదన్నేలా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దింది. ప్రతి పీహెచ్‌సీలో 55 వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తోంది. పీహెచ్‌సీల పనితీరు, సిబ్బంది హాజరుపై నిరంతరం పర్యవేక్షణ పెడుతోంది. ఇక ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ సిబ్బంది కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపట్టింది. 108 వాహనాల్లో ఓ డాక్టర్ విధులు నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకుంది. ఆస్పత్రికొచ్చిన ప్రతి గర్భిణీకి సుఖప్రసవం అయ్యేలా సిబ్బందికి శిక్షణ ఇచ్చింది. ఒక్కోకాన్పునకు రూ.4వేల చొప్పున ఆయా పీహెచ్‌సీలకు ప్రోత్సాహం కింద చెల్లించడం వారిలో మరింత ఉత్సాహాన్ని నింపింది. కడుపు కోతల్లేని కాన్పులకు కేరాఫ్ అడ్రస్‌గా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను తీర్చిదిద్దింది.



పాపానాయుడుపేట పీహెచ్‌సీలో అర్ధరాత్రి వచ్చిన మహిళకు కాన్పు చేస్తున్న ఏఎన్‌ఎం



ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా రోగుల నివాసాలకు వెళ్లి వైద్యసేవలు అందించి వస్తున్న సిబ్బంది

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

పీహెచ్‌సీలు 108

24 గంటలు పనిచేసే ఆస్పత్రులు 78

ప్రతి పీహెచ్‌సీలో ఉన్న సిబ్బంది 14

కేడర్	ప్రస్తుతం ఉన్న సిబ్బంది
సివిల్ అసిస్టెంట్ సర్జన్	02
స్టాఫ్ నర్సులు	03
ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2	01
ఫార్మసిస్ట్ గ్రేడ్ 2	01
సీహెచ్‌ఓ/ఎంపీహెచ్‌ఓ	01
హెల్త్ ఎడ్యుకేటర్/పీహెచ్‌ఎన్	01
ఎంపీహెచ్‌ఎస్(ఎఫ్)	01
ఎంపీహెచ్‌ఎస్(ఎం)	01
ఎల్‌డీ కంప్యూటర్/జూనియర్	
అసిస్టెంట్/సీనియర్ అసిస్టెంట్	01
ఎఫ్‌ఎన్‌ఓ	01
శానిటరీ అటెండర్, వాచ్‌మన్	01

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్ లేకుండా చేసిన కాన్పులు

నెల	సాధారణ కాన్పు	ఆపరేషన్‌లు	మొత్తం
ఏప్రిల్-2022	88	0	88
మే	102	0	102
జూన్	112	0	112
జూలై	103	0	103
ఆగస్టు	78	0	78
సెప్టెంబర్	92	0	92
అక్టోబర్	82	0	82
నవంబర్	107	0	107
డిసెంబర్	116	0	116
జనవరి	100	0	100
ఫిబ్రవరి	87	0	87
మార్చి	69	0	69
మొత్తంః	1,136		1,136

న్యూస్‌రీల్

ఆర్టీసీ పార్శిల్ బుకింగ్ ఏజెన్సీలకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్: ఆర్టీసీ పార్శిల్ బుకింగ్ ఏజెన్సీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు-2 డిపో పరిధిలో ఎస్టేట్, కొంగారెడ్డిపల్లె, జీడీ నెల్లూరు, పూతలపట్టు, వేలూరు (తమిళనాడు), బలిజకండ్రిగతో పాటు ప్రతి గ్రామంలోనూ ఏజెన్సీ నిర్వహణకు అనుమతులు ఇస్తామని వెల్లడించారు. ఇందుకోసం డిపాజిట్ కింద నగర ప్రాంతాలకు రూ. 5వేలు, మున్సిపాలిటీలకు రూ.2500, మండల పరిధిలో రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ప్రతి పార్శిల్ బుకింగ్‌కు 15 శాతం, పార్శిల్ రిసీవింగ్‌కు 2శాతం కమిషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు 7382874950 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సచివాలయ సిబ్బందికి షోకాజ్

చిత్తూరు కలెక్టరేట్ : విధి నిర్వహణలో అలసత్వం వహించిన 665 మంది సచివాలయ ఉద్యోగులకు కలెక్టర్ షణ్మోహన్ షోకాజ్ నోటీసులను సోమవారం జారీ చేశారు. సంక్షేమం, అభివృద్ధి పనులను తనిఖీ చేసి సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనందుకు వెంటనే సంజాయిషీ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు 128 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లు, 157 మంది మహిళా పోలీసులు, 380 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు అందించారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ గో సంరక్షణ ట్రస్ట్‌కు గుంటూరుకు చెందిన నవీన్ రూ.లక్ష విరాళం అందించారు. సోమవారం ఉదయం ఈమేరకు ఆలయ అధికారులకు నగదును అందించారు. దాతకు ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. జ్ఞాపికను బహూకరించారు.

సేవకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న అంజప్ప

పెద్దపంజాణి: ఆర్‌టీఐ సెల్ రాష్ట్ర అధ్యక్షుడి (ఎస్‌హెచ్‌ఆర్‌సీ)గా విశేష సేవలందించిన నిడిగుంట గ్రామానికి చెందిన అంజప్పకు ఉత్తమ పురస్కారం లభించింది. సోమవారం హైదరాబాదులోని తెలంగాణ సరస్వత పరిషత్‌లో ఆయనకు నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ చైర్మన్ ప్రతిష్టాత్మక అంబేడ్కర్ సేవాపురస్కార్-2023ను అందించారు. అవార్డు గ్రహీతకు పలువురు అభినందనలు తెలిపారు.

జనరంజకంగా జగనన్న పాలన

- రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి రోజా



లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

నగరి : జనరంజకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా కొనియాడారు. సోమవారం పట్టణంలోని 25వ వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్‌ను అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులకు జగనన్న శ్రీకారం చుట్టారన్నారు. చంద్రబాబు పాలనలో పాడుబడిన ప్రభుత్వ పాఠశాలలునేడు కార్పొరేట్ స్థాయికి చేరాయని తెలిపారు. ఒకప్పుడు తాగునీరు, మరుగుదొడ్లు కూడా లేని పాఠశాలల్లో, నేడు మినరల్ వాటర్, అత్యాధునిక బాత్‌రూమ్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గతంలో ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటేనే ప్రజలు భయపడేవారని, ఇప్పుడు అత్యున్నత వసతులతో, అత్యాధునిక పరికరాలతో కళకళలాడుతున్నాయని వెల్లడించారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్న జగనన్న అందరి గుండెల్లో నిలిచిపోయారని చెప్పారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నకు మద్దతుగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పెరుగుతున్న ప్రజాదరణను ఓర్వలేక టీడీపీ నేతలు పచ్చమీడియాను అడ్డుపెట్టుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, జ్యోతి, ఇంద్రయ్య, గోపాల్‌రెడ్డి, అమర్, మణిగండన్, సేడు, కుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఫ్లెక్సీల తొలగింపు అవాస్తవం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, పక్కన సీఐ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐ మోహన్‌కుమార్

పుంగనూరు : పట్టణంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పలువురు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించామన్నది అవాస్తవమని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం పురపాలక కార్యాలయంలో సీఐ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐ మోహన్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అంబేడ్కర్ జయంతికి ముందురోజున పలు కూడళ్లలో ఎలాంటి అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జయంతి కార్యక్రమాలు పూర్తయిన తర్వాత 15వ తేదీ రాత్రి ఆయా ఫ్లెక్సీలను తొలగించామని వివరించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది ఫ్లెక్సీలను తొలగిస్తుండగా, కొందరు మద్యం సేవించి గొడవకు దిగడంతో కమిషనర్ అందించిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లామన్నారు. ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన వంశీకృష్ణ, నరేంద్ర అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామని తెలిపారు. వారికి పరీక్షలు చేయించగా, మద్యం సేవించినట్లు తేలిందని వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. తానూ దళితుడినే అని, అంబేడ్కర్‌ను కించపరిచే ఉద్దేశం లేదని వివరించారు. కొందరు రాజకీయ లబ్ధి కోసం అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోమని, విధి నిర్వహణలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

బీసీ సమస్యలపై అధ్యయనం

చిత్తూరు కార్పొరేషన్: బీసీల సమస్యలపై అధ్యయనం చేయనున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా కన్వీనర్ రాగసందేశ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.

కాణిపాకంలో ఉభయదారుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉభయదారులు

కాణిపాకం (యాదమరి) : కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వీఐపీ గేట్ వద్ద ఉభయదారులు సోమవారం నిరసనకు దిగారు. ముందుగా పీఆర్‌ఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఈఓ రావాలని డిమాండ్ చేశారు. ఉభయదారులు మాట్లాడుతూ తాము ఎప్పుడైనా దర్శనం చేసుకోవచ్చని ఇచ్చిన హామీని ఈఓ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై బుధవారం 14 గ్రామాల ఉభయదారులు ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఇదీ అసలు సమస్య

భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ఈఓ వెంకటేశు వీఐపీ, ఇతర గేట్లకు తాళం వేయించారు. అదే సమయంలో చంద్రప్రభ వాహన ఉభయదారులు తమ బంధువులతో స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. సాంప్రదాయ దుస్తులతో వచ్చామనీ, అంతరాలయ దర్శనం కల్పించాలని కోరారు. ఈఓ అనుమతించకపోవడంతో వాగ్వాదానికి దిగారు. అయితే రికార్డుల్లో వీఐపీ దర్శనాల ఉండడంతో వారు నిరసన వ్యక్తం చేశారు.

రద్దీ సమయంలో అంతరాలయ దర్శనాలు నిలిపివేశాం

ఆదివారం ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఉభయదారుల బంధువులు అంతరాలయంలో స్వామివారి దర్శనం చేసుకోవాలని కోరారు. కానీ రద్దీ సమయాల్లో అంతరాలయ దర్శనాలు నిలిపివేయాలని దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు ఉన్నందున అంతరాలయం దర్శనాలు కల్పించలేదు.

– వెంకటేశు, ఆలయ ఈఓ

ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్



మంగళంపేటలో నిర్మిస్తున్న గాలిగోపురం

పులిచెర్ల(కల్లూరు) : టీటీడీ ఆధీనంలోని ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 1988 నుంచి ఇప్పటి వరకు మొత్తం 33 ఆలయాలు టీటీడీ పరిధిలోకి వచ్చాయన్నారు. అందులో పుంగనూరు నియోజకవర్గంలోని 5 ఆలయాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారని వెల్లడించారు. మంగళంపేటలో ప్రస్తుతం రూ.1.98 కోట్లతో గర్భగుడి, గాలిగోపురం పనులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. రూ.80లక్షలతో ప్రహరీగోడ నిర్మాణానికి ప్రతి పాదనలు పంపినట్లు తెలిపారు. అలాగే బూరగమంద వెంకటేశ్వర స్వామి ఆలయ స్వాగత ద్వారానికిరూ.14లక్షలు, తాగునీటిబోరుకు రూ.6లక్షలు, ఆవులపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయ గాలిగోపుర నిర్మాణానికి రూ.60.0లక్షలు, రాజనాలబండ ఆంజనేయస్వామి ఆలయ గాలి గోపుర నిర్మాణానికి రూ.60లక్షలు, పోటు నిర్మాణానికి రూ.9లక్షలు, బోరు, మోటారుకు రూ.16లక్షలు, మంగళంపేట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం, గాలిగోపురానికి రూ.1.98కోట్లు, పుంగనూరు వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.40.0లక్షలు విడుదల చేయించారని వివరించారు. ఆయా ఆలయాల్లో పనిచేసే సిబ్బందికి జీతాల పెంపుదలకు సైతం మంత్రి చర్యలు చేపట్టారని తెలిపారు. ఆ మేరకు ఇటీవల జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో తీర్మానం చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో అర్చకులకు రూ.10వేలు, పరిచారకులకు రూ.7,500, ఇతరులకు రూ.5వేలు, మేళగాళ్లకు రోజుకు రూ.400 చొప్పున శ్రీవాణి ట్రస్టు ద్వారా అందించనున్నట్లు వివరించారు.

అగ్నిప్రమాదంలో వ్యక్తి మృతి


నిరంజన్ మృతదేహం

పుంగనూరు : మండలంలోని మార్లపల్లెలో ఆదివారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో సి.నిరంజన్(45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు కథనం మేరకు.. నిరంజన్ తన ఇంట్లో దోమల నివారణకు పొగ వేసుకుని నిద్రించాడు. ఈ క్రమంలో మంటలు వ్యాపించి ఇల్లుతోపాటు నిరంజన్ కూడా దహనమయ్యాడు. ఎస్ఐ మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

10మంది పేకాటరాయుళ్లకు జైలు

యాదమరి: మండలంలోని 10 మంది పేకాటరాయుళ్లకు రెండు జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న రాత్రి చిన్నంపల్లె గ్రామ సమీపంలో పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి విచారించి నిందితులకు శిక్ష విధించినట్లు వివరించారు.

సారా విక్రేత అరెస్ట్

సదుం: మండలంలోని బూరగమంద క్రాస్ వద్ద చీకలచేనుకు చెందిన అమరేంద్ర అనే సారా విక్రేతను పులిచెర్ల సెబ్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 5లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. దాడిలో ఎస్ఐ కవీశ్వర్ నాయుడు, హెచ్‌సీ సుధాకర, ఈసీ మధు, రేఖ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి..

చౌడేపల్లె : మండలంలోని పందిళ్లపల్లె వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవికుమార్ సోమవారం తెలిపారు. చుక్కావారిపల్లెకు చెందిన నిందితుడు ఎస్.వెంకటరమణ నుంచి 25 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించారు.

జిల్లాలోని వ్యవసాయ భూమి సారం కోల్పోతోంది.. రైతులు వినియోగిస్తున్న రసాయన ఎరువులతో నత్రజని తగ్గుతోంది.. అదే సమయంలో భాస్వరం శాతం పెరుగుతున్నట్లు పలు అధ్యయనాల్లో తేలుతోంది.. ఇప్పటికైనా అన్నదాతలు సేంద్రియ సాగుపై దృష్టి సారించకుంటే భవిష్యత్తు ప్రమాదంలో పడనుంది.. ఈ మేరకు ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.. ఆర్‌బీకేల ద్వారా భూసార పరీక్షలు చేయించి సమగ్ర సమాచారం సేకరిస్తోంది.. ఫలితాలను అనుసరించి ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది.. ముంచుకొస్తున్న ఉపద్రవం నుంచి వ్యవసాయరంగాన్ని పరిరక్షించేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది.


భూసారం లేక మొలకెత్తని పంట


పొలం స్థితిగతులను పరిశీలిస్తున్న ఆర్బీకే, వ్యవసాయశాఖ అధికారులు

భూసారం.. భవితవ్యం

- రసాయన ఎరువుల వాడకంతో నిస్సారమవతున్న భూములు
- మోతాకు మించి యూరియా వినియోగిస్తే ఇబ్బందులు
- సేంద్రియ విధానమే శ్రేయస్కరమంటున్న శాస్త్రవేత్తలు

పలమనేరు : జిల్లాలో సుమారు 64శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. వర్షాధారంగా రైతులు వరితోపాటు వేరుశనగ, రాగి, జొన్న, కంది తదితర పప్పుధాన్యాలతో పాటు, నూనె గింజలు, కూరగాయ పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో సేంద్రియ ఎరువుల వాడకం తగ్గడం, రసాయన ఎరువుల వినియోగం పెరగడంతో భూములు నిస్సారంగా మారుతున్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో ప్రభుత్వం భూసార పరీక్షలు చేయించింది. వీటి ఫలితాలు అంత ఆశాజనకంగా లేనట్లు వెల్లడైంది. భూమి సారవంతంగా ఉండాలంటే ముఖ్య పోషకాలపైన నత్రజని, భాస్వరం, పొటాష్ సమపాళ్లలో ఉండాలి. అయితే జిల్లాలోని భూముల్లో నత్రజని తగ్గి, భాస్వరం మోతాదుకు మించి ఉన్నట్లు పరీక్షల్లో తేలింది.

నష్టాలు.. నివారణ

భూమిలో నత్రజని తగ్గడం వల్ల పంట దిగుబడి తగ్గి చీడపీడలు త్వరగా వ్యాప్తి చెందుతాయి. నివారణకు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జమ్ము, ప్రెస్‌మడ్‌లను వాడాలని వ్యవసాయ శాఖ చెబుతోంది. భాస్వరం తగ్గించేందుకు కాంప్లెక్స్ ఎరువుల్లో డీఏపీ 30 శాతం వాడుకుంటే చాలని సూచిస్తోంది. ఇలాంటి భూముల్లో పీఎస్‌బీ (పాస్పెట్ సాలిబులైజింగ్ బ్యాక్టీరియా)ను వాడాల్సి ఉంది. పొటాష్‌ను పంటకు కావాల్సిన మోతాదులో చల్లుకోవాలి. ముఖ్యంగా దిబ్బ ఎరువుల వాడకం పెరగాలని వెల్లడిస్తున్నారు.


కల్లాడు గ్రామంలో భూసార పరీక్షలు (ఫైల్)


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

కొంపముంచుతున్న యూరియా

సాధరణంగా యూరియాను రైతులు వరి, మిరప, మల్బరీ తదితర పంటలకు వాడుతున్నారు. యూరియాలో ఎన్‌పీకే (నైట్రోజన్, ఫాస్పరస్, పోటాషియం) మిశ్రమంలో 46 శాతం నత్రజని ఉంటుంది. దీన్ని చల్లడంతో మొక్కలు విపరీతంగా పెరుగుతాయి. ఆశించిన దిగుబడి రాకపోగా భూ సారం తగ్గుతుంది. జిల్లాలోని రైతులు ఎక్కువగా పశుగ్రాసానికి యూరియాను వాడుతున్నారు. దీని కారణంగా పాలలో ఎల్ఆర్ తగ్గుతోందని పశుసంవర్ధకశాఖ చెబుతోంది. మల్బరీకి సైతం ఆకు ఏపుగా పెరగాలని వాడుతున్నారు. ఫలితంగా పట్టుగూళ్ల బరువు తగ్గుతున్నట్లు రైతులు గుర్తించారు.

కాపాడుకునేందుకు..

భూసారం కాపాడుకునేందుకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రి పద్ధతులను అవలంభించాలి. భూమిలో తేమ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. వర్షపు నీరు పొలాల్లోనే ఇంకేలా చూడాలి. పచ్చిరొట్ట ఎరువులైన జనుము, పిల్లిపెసర, అలసందలను సాగుచేయాలి. పంట మార్పిడి విధానాన్ని కచ్చితంగా పాటించాలి. భూమిని లోతుగా వాలుకు అడ్డంగా దున్నుకోవాలి. చేనుల్లో వాలు చాళ్లు, చేను గట్లు, చిన్నరాళ్ల గట్లు, వాలు గట్లు, హద్దురాళ్ల గోడలను నిర్మించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పరీక్షల ఆధారంగా ఎరువులు



ఆర్‌బీకేల ద్వారా భూసార పరీక్షలు చేయిస్తున్నాం. రైతులకు సాయిల్ హెల్త్‌కార్డులను అందిస్తున్నాం. అందులో మట్టి పరీక్షల వివరాలుంటాయి. ఈ ఫలితాలతో నేల స్వభావం తెలుస్తుంది. ఉదజని సూచిక మేరకు క్షార స్థితిని తెలుసుకోవచ్చు. అనంతరం లవణ సూచిక మేరకు పంటల స్థితిగతులను అర్థం చేసుకోవచ్చు. ఆ మేరకు భూమికి ప్రధాన పోషకాలను ఎంత మోతాదులో అందించాలో తెలుస్తుంది. పరీక్షల ఆధారంగా ఎరువులను వాడుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు. –'వై.అన్నపూర్ణాదేవి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు

రసాయన ఎరువులతో నష్టం



రసాయన ఎరువులతో చాలా నష్టాలున్నాయి. భూమి సారం కోల్పోయి మళ్లీ పంటలు పండని విధంగా తయారవుతున్నాయి. సేంద్రియ ఎరువులైన దిబ్బపేడ, గొర్రె పిచ్చుకలు, ఎండిన ఆకులు, అలములను ఎరువుగా వాడుకుంటే చాలా మంచిది. దీంతో భూమి సారవంతంగా మారి అధిక దిగుబడి పొందే అవకాశముంటుంది. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం చేయిస్తున్న భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి.

– సుబ్రమణ్యంరెడ్డి, రైతు, కల్లాడు, పలమనేరు మండలం

దంపతుల హత్యకేసులో ఐదుగురిపై కేసు


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చౌడేపల్లె: మండలంలోని శెట్టిపేట పంచాయతీ ఎర్రగానిపల్లె వద్ద ఈ నెల 13వ తేదీన జరిగిన దంపతుల హత్యకేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మధుసూదనరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఎస్ఐ రవికుమార్‌తో విలేకర్ల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఈనెల 9 తేదీవ తేదీన ఐదుగురు నిందితులు అడవి జంతువులను వేటాడేందుకు 11 కేవీ తీగల నుంచి విద్యుత్ తీసుకుని ఉచ్చులు వేశారు. ఈ విషయం తెలియక ఆ మార్గంలో వెళుతున్న మునీంద్ర అలియాస్ ముని, అతడి భార్య భీరమ్మ విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. దీంతో ముదిరెడ్డిపల్లెకు చెందిన ఎర్రిమణి, తంగా వెంకటరమణారెడ్డి అలియాస్ భూషణ్‌రెడ్డి, మేకలచిన్నేపల్లెకు చెందిన హరినాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దేవిరెడ్డి కలిసి మృతదేహాలను బెడ్‌షీట్‌లో చుట్టి బావిలో పడేశారు. నిందితుల్లో ఎర్రి మణి, తంగా వెంకటరమణారెడ్డి అలియాస్ భూషణ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డిని అరెస్ట్ చేశామన్నారు. దేవిరెడ్డి, హరినాథరెడ్డిని అరెస్ట్ చేసేందుకు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

బిడ్డల నిరాదరణ..
వృద్ధ తల్లిదండ్రుల ఆవేదన

- ఏడుగురున్నా అనాథలుగా వదిలేశారని ఫిర్యాదు
- కలెక్టర్, ఎస్పీని ఆశ్రయించిన బాధితులు


డీఎస్పీ కార్యాలయం వద్ద వృద్ధ దంపతులు

పలమనేరు: ఏడుగురు పిల్లలను పెంచి పెద్ద చేస్తే పట్టెడన్నం పెట్టకుండా నిరాదరిస్తున్నారని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టర్, ఎస్పీని బాధితుల ఆశ్రయించారు. వారి ఆదేశాల మేరకు పలమనేరు డీఎస్పీ కార్యాలయానికి వచ్చారు. బాధితుల కథనం మేరకు.. కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం అనిగానిఊరుకు చెందిన చెంగప్ప(83), సిద్ధమ్మ (72) దంపతులకు ఏడుగురు పిల్లలు. అందరికీ వివాహమైంది. చిన్న కుమార్తె మంగమ్మ ప్రేమించి పెళ్లి చేసుకుంది. దీంతో అల్లుడిని ఇల్లరికం పెట్టుకున్నారు. తల్లిదండ్రులను తాను చూసుకుంటానని నమ్మించింది. దీంతో వారు తమకున్న 37 సెంట్ల స్థలాన్ని రాసిచ్చారు. రిజిస్ట్రేషన్ కాగానే మంగమ్మ నిజస్వరూపం బయటపెట్టింది. తల్లిదండ్రులను ఏమాత్రం పట్టించుకోలేదు. ఇంట్లో నుంచి వారిని బయటికి గెంటేసింది. తమకు ఆస్తి ఇవ్వలేదని మిగిలిన పిల్లలు కూడా వృద్ధ దంపతులను పట్టించుకోలేదు. చివరకు అనారోగ్యం బారిన పడితే ఆస్పత్రికి సైతం ఎవరూ తీసుకెళ్లలేదు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,700

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

ఏనుగుల దాడిలో పంట నష్టం

రామకుప్పం: మండలంలోని పీఎంకే తండాలో ఏనుగులు ఆదివారం రాత్రి బీభత్సం సృష్టించాయి. నానిక్య నాయక్ అనే రైతుకు చెందిన 35 మూటల బంగాళదుంపలను తొక్కి నాశనం చేశాయి. దీంతో రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

వామ్మో..కొండచిలువ!



వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ రాజీవ్‌నగర్‌లో పాముల బెడదతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. స్థానిక పురవీధుల్లో సైతం విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో పంచాయతీవారు వీధి లైట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో తరచూ వీధుల్లో పాములు సంచరిస్తున్నాయి. తాజా గా సోమవారం రాత్రి ఏకంగా కొండచిలువ రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఇప్పటికైనా వీధుల్లో స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

దోపిడీ 'ఖ'నిజం!



సైదాపురం: విలువైన ఖనిజం కోసం రాత్రికి రాత్రే కొండను తవ్వేసిన ఘటన మండలంలో కలకలం రేపుతోంది. వివరాలు.. సైదాపురానికి పది కిలోమీటర్ల దూరంలో తురిమెర్ల గ్రామం ఉంది. దీనికి సమీపంలో పురాతనమైన ఈన్నరాల తిప్ప ఉంది. ఇది సర్వే నం.359–1, 461, 446లో సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. కొందరు అక్రమార్కుల కన్ను కొండపై పడింది. రాత్రి రాత్రే యంత్రాలతో కొండలో ఉన్న విలువైన ఖనిజాన్ని తవ్వేస్తున్నారు. ఇప్పటికే రూ.2 కోట్ల మేర ఖనిజ సంపదను తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ అనుమతు లేకుండా అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవు. ఈన్నరాల తిప్పలో తవ్వకాలు జరుగుతున్నట్టు ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదు.

– శ్రీనివాసరావు, జిల్లా మైనింగ్ అధికారి(ఏడీఎంజీ)

మద్యం విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్: కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని విక్రయిస్తున్న పి.చంద్రశేఖర్ (43) అనే వ్యక్తిని టాస్క్ ఫోర్స్ (డీటీఎఫ్) పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. చిత్తూరు–చిత్తపార రూట్‌లో సి.బండపల్లె వద్ద సీఐ మాధవస్వామి, మస్తాన్‌వలీ తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు పట్టుబడ్డాడు. 32 టెట్రా ప్యాకెట్లు, మధ్యప్రదేశ్‌కు చెందిన 6 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

పేదల గుండెలో సీఎంకు సుస్థిర స్థానం


గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి


టీడీపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మోహిత్ రెడ్డి

- గడప గడపకు మహా పాదయాత్రలో మోహిత్ రెడ్డి

భాకరాపేట: రాష్ట్రంలో విప్లవాత్మకమైన సంస్కరణలతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల మనసులో సుస్థిర స్థానాన్ని సాధించారని చంద్రగిరి వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎర్రవారిపాళెం మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. గడపగడపకు మహా పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా ఉదయం 7 గంటలకే నెరబైలు పంచాయతీలోని పల్లె గడపలు తొక్కారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని గడప గడపకూ వెళ్లి లబ్ధిదారులకు వివరించారు. బండమీద కమ్మపల్లిలో ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. నెరబైలు పంచాయతీ పార్టీ శ్రేణులు మోహిత్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. పాత తురకపల్లిలో రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన ఆయన ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తీవ్ర ఎండను సైతం ఆయన లెక్కచేయక కుమ్మరగడ్డ వారి పల్లి నుంచి బెల్లంవారి పల్లి, బండమీద కమ్మపల్లి, బిజ్జేవారిపల్లి, కొంగరవారిపల్లి, పులిబోనుపల్లి, వైఎస్సార్ జగనన్న కాలనీ, బీసీ కాలనీ, గిరిజన కాలనీ, పాతతురక పల్లె, చింతకాయల హరిజనవాడ, ఊటబావులపల్లి మీదుగా పాదయాత్ర కొనసాగించారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతల చేరిక

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో బండమీద కమ్మపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేతలు వేణుగోపాల్ నాయుడు, గురప్పనాయుడు, హర్షవర్ధన్‌నాయుడు, బుల్లినాయుడు, సిద్ధయ్యనాయుడు, హరి, మురుగేష్‌చౌదరి(చౌదరి) తదితరులు వైఎస్ఆర్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు.

రూ.6.74 కోట్లతో అభివృద్ధి పనులు

మండలంలో రూ.6.74 కోట్లతో అభివృద్ధి పనులు పట్టామని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ప్రధానంగా రూ.4.43 కోట్లతో రహదారులు నిర్మాణం, నాడు – నేడు పథకం కింద రూ.96 లక్షలతో పాఠశాలల ఆధునికీకరణ జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.దేవేంద్ర, ఉప సర్పంచ్ అబ్దుల్ రెహమాన్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జ్ చెంగల్‌రెడ్డి, కన్వీనర్ నాగార్జునరెడ్డి, సీనియర్ నాయకులు హరినాథ్‌రెడ్డి, వెంకట సిద్దులు, బాబునాయుడు, షేక్ సుభాన్, సయ్యద్ ఇసూబ్, ఇమ్రాన్, రెడ్డి శేఖర్, బాలకృష్ణ, రెడ్డెప్పరెడ్డి, పంచాయతీ కన్వీనర్ జయంత్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.